

దిగుబడి తగ్గింది.. ధర పెరిగింది

టమాట ధరలు మార్కెట్లో పుంజుకొన్నాయి. వారం రోజుల క్రితం ధరలతో పోల్చితే 50 శాతం మేర పెరిగాయి. - 8లో



పోలీస్‌స్టేషన్ ఎదుట మహిళ ఆత్మహత్యాయత్నం

మదనపల్లె టూటౌన్ పోలీస్‌స్టేషన్ ఎదుట శనివారం ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.510	రూ.580
రెండోరకం	రూ.300	రూ.500

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 970 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

నాటా సభలకు ప్రభుత్వ విప్ కొరముట్లకు ఆహ్వానం



రైల్వేకోడూరు: జులై 2న ఉత్తర అమెరికాలో జరగనున్న నార్త్ అమెరికా తెలుగు అసోసియేషన్(నాటా) సభలకు ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులుకు నాటా ప్రతినిధులు ఆహ్వానం పంపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన, అభివృద్ధి, వనితీరు వంటి అంశాలపై అమెరికాలో ఉన్న తెలుగు ప్రజలకు వివరించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఇన్‌స్పైర్ అవార్డ్స్ మనక్ నామినేషన్లకు ఆహ్వానం

రాయచోటి: 2023–24వ సంవత్సరానికి సంబంధించి ఇన్‌స్పైర్ అవార్డ్స్ మనక్ నామినేషన్లను ఆన్‌లైన్ ద్వారా ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుళరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు నెల 31వ తేదీ వరకు నామినేషన్లను స్వీకరిస్తారన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల హెడ్మాస్టర్లు, ప్రిన్సిపాల్స్ విద్యార్థుల వివరాలతో సిద్ధంగా ఉండాలని సూచించారు. ప్రతి పాఠశాల నుంచి ఐదుగురు విద్యార్థులను ఎంపిక చేయాలన్నారు.


గండి నిత్యాన్నదానానికి ఎంపీ మిథున్‌రెడ్డి విరాళం



గండి అంజన్న సన్నిధిలో రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి (ఫైల్)

చక్రాయపేట: గండి పుణ్యక్షేత్రంలో జరిగే నిత్యాన్నదాన పథకానికి రాజంపేట పార్లమెంట్ సభ్యుడు మిథున్‌రెడ్డి రూ.5లక్షలు విరాళంగా అందజేశారని ఆలయ సహాయ కమిషనర్ అలవలపాటి ముకుందారెడ్డి తెలిపారు.గత ఏడాది అక్టోబర్ నెలలో మిథున్‌రెడ్డి గండికి వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారని చెప్పారు. ఆ సమయంలో నిత్యాన్నదాన పథకానికి రూ.5లక్షలు విరాళంగా ఇస్తానని ప్రకటించారని, ఈమేరకు ఆయన శనివారం సదరు మొత్తాన్ని బ్యాంకు ఆలయ ఖాతాకు జమచేసి సమాచారాన్ని తమకు అదజేశారని తెలిపారు.ఈసందర్భంగా కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పినుపోలు రాఘవేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు కృషి చేయండి



కలికిరి పోలీస్ స్టేషన్‌లో పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ గంగాధర రావు

కలికిరి: నేరాల నియంత్రణకు కృషి చేయాలని జిల్లా ఎస్పీ గంగాధర రావు అన్నారు. కలికిరి మండలంలో శనివారం ఆయన విస్తృతంగా పర్యటించారు. సాధారణ తనిఖీలలో భాగంగా పోలీస్ స్టేషన్‌లో రికార్డులు పరిశీలించి, శాంతి భద్రతల పరిరక్షణ, విధుల నిర్వహణ, సమస్యలతో స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుల పట్ల పోలీసులు మసలుకోవాల్సిన తీరుపై ఎస్పీ సూచనలిచ్చారు. అనంతరం సైనిక పాఠశాలకు చేరుకుని ప్రిన్సిపాల్ కెప్టెన్ చరణ్‌జీత్‌సింగ్ పరదేశి, వైస్ ప్రిన్సిపాల్ శ్యామ్‌సింగ్ ధీరోజి రాథోడ్‌లతో సమావేశమయ్యారు. తర్వాత సీఆర్‌పీఎఫ్ కేంద్రానికి చేరుకుని కమాండెంట్‌లు రాజేష్ కుమార్, నీజర్ కుమార్ పాండేలతో కలిసి కేంద్ర ఆవరణలో పరిశీలించారు. అలాగే బీఎస్ఎఫ్ కేంద్రంలో డిప్యూటీ కమాండెంట్ అశోక్ చౌదరితో, ఐటీబీపీ బెటాలియన్ కేంద్రంలో కమాండెంట్ అమిత్ బాటితో సమావేశమయ్యారు. కార్యక్రమంలో వాల్మీకిపురం సీఐ సురేష్ కుమార్, ఎస్ఐ రహీముల్లా, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆహా.. ఏమిరుచి.!

విద్యారంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్న వైఎస్ జగన్ సర్కార్.. సంక్షేమ వసతి గృహాల్లో ఉంటూ విద్యనభ్యసించే విద్యార్థులకు కమ్మని భోజనం వడ్డించాలని నిర్ణయించింది. ఈ క్రమంలో సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లోని విద్యార్థులకు డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచింది. ఈ విద్యా సంవత్సరం నుంచి నూతన చార్జీలు అమలు చేస్తుండగా, విద్యార్థికి కొత్త మెనూతో పోషకాలతో కూడిన భోజనం అందుతోంది.

- డైట్ చార్జీలు పెంచిన జగన్ సర్కార్
- ఈనెల 12 నుంచి అమలులోకి వచ్చిన కొత్తమెనూ
- జిల్లాలో వంద హాస్టళ్ల విద్యార్థులకు లబ్ధి
- హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు



బీసీ హాస్టల్‌లో భోజనం చేస్తున్న విద్యార్థులు

మదనపల్లె సిటీ: ప్రభుత్వ వసతిగృహాల విద్యార్థులకు జగన్ సర్కార్ శుభవార్త చెప్పింది. నాణ్యమైన భోజనం అందించడంతో పాటు మెరుగైన సౌకర్యాలు కల్పించాలన్న ఉద్దేశంతో డైట్, కాస్మోటిక్ చార్జీలను పెంచింది. ఫలితంగా నూతన మెనూతో కూడిన పోషకాలతో కూడిన భోజనం, హాస్టల్ విద్యార్థులకు అందనుంది. నిత్యావసరాల ధరలు పెరగడం, హాస్టళ్లలో మెరుగైన మెనూ అమలు చేయాలని భావించిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం డైట్‌చార్జీలు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. జూన్ నెల 12 నుంచి పెంచిన డైట్ చార్జీలు అమలు చేయాలని ఉత్తర్వులు ఇచ్చింది.

కొత్త మెనూ అమలు: ప్రభుత్వం డైట్‌చార్జీలు పెంచిన నేపథ్యంలో అధికారులు పోషకాలతో కూడిన నూతన మెనూ అమలు చేస్తున్నారు. గతంలో కన్నా మెనూకు అదనంగా మరికొన్ని చేర్చి నూతన మెనూను హాస్టళ్ల పునః ప్రారంభం నుంచే అమలు చేస్తున్నారు.

తరగతుల వారీగా పెరిగిన మెస్‌చార్జీల వివరాలు

తరగతి	హాస్టల్ గ్రేడ్	2018లో	2023లో పెరిగిన చార్జీలు
3,4	ప్రీ మెట్రిక్ హాస్టళ్లు	రూ.1000	రూ.1,150
5నుంచి 10	ప్రీమెట్రిక్ హాస్టళ్లు	రూ.1250	రూ.1400
ఇంటర్ ఆపైన	పోస్ట్‌మెట్రిక్ హాస్టళ్లు	రూ.1400	రూ.1600

హాస్టళ్లల్లో పెరుగుతున్న అడ్మిషన్లు

జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ తదితర సంక్షేమ వసతి గృహాలతో పాటు రెసిడెన్షియల్ పాఠశాలలు ఉన్నాయి. ఒక్కో వసతి గృహంలో 100 సీట్లు ఉన్నాయి. ఈ విద్యా సంవత్సరం అడ్మిషన్లు జరుగుతున్నాయి. ఇటీవల సుమారు 10 నుంచి 15 శాతం అడ్మిషన్లు పెరిగాయి. ఈ క్రమంలో జిల్లాలోని హాస్టళ్లల్లో పూర్తి స్థాయి సీట్లు భర్తీ అవుతాయని భావిస్తున్నారు.

కాస్మోటిక్ చార్జీలూ పెంపు

కాస్మోటిక్ చార్జీలు మూడు నుంచి ఆరో తరగతి బాలురకు రూ.110 నుంచి రూ.160, బాలికలకు రూ.110 నుంచి రూ.130, ఏడో తరగతి నుంచి పదో తరగతి చదువుతున్న బాలురకు రూ.125 నుంచి రూ.150, బాలికలకు రూ.160 నుంచి రూ.200, ఇంటర్ ఆపైన విద్యార్థులకు రూ.125 నుంచి రూ.200, విద్యార్థినులకు రూ.160 నుంచి రూ. 200కు పెంచింది. ప్రభుత్వం డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సంక్షేమ వసతి గృహాలు: 55
విద్యార్థులు : 4 వేల మంది
బీసీ సంక్షేమ ప్రీ మెట్రిక్ వసతి గృహాలు : 33
విద్యార్థులు : 2704
పోస్టుమెట్రిక్ వసతి గృహాలు : 12
విద్యార్థులు : 900

పేద విద్యార్థులకు వరం



ప్రభుత్వం మెస్ చార్జీలు పెంచడం ద్వారా మాలాంటి పేద విద్యార్థులకు మేలు జరుగుతుంది. హాస్టళ్లలో ఇప్పటికే సౌకర్యాలు మెరుగు పడ్డాయి. రుచికరమైన భోజనం వడ్డిస్తే మేము హాయిగా చదువుకుంటాం. -లవకుమార్, 9వ తరగతి బీసీ హాస్టల్, మదనపల్లె

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు



ప్రభుత్వం విద్యార్థుల కోసం మంచి నిర్ణయం తీసుకుంది. పెరిగిన ధరలకు అనుగుణంగా డైట్‌చార్జీలు పెంచడం వల్ల మాకు మంచి భోజనం అందుతుంది. మాలాంటి వాళ్ల గురించి ఆలోచిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు. -కార్తీక్‌నాయక్, 9వ తరగతి, బీసీ హాస్టల్, మదనపల్లె

కొత్త మెనూ అమలు



సంక్షేమ హాస్టళ్లల్లో కొత్త మెనూ అమలు చేస్తున్నాం. కొత్త మెనూతో పాటు కాస్మోటిక్ చార్జీలు పెంచడం వల్ల అడ్మిషన్లు పెరిగాయి. వసతి గృహాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాం. విద్యార్థులు చదువులో కూడా రాణిస్తున్నారు. -బి.సందప్ప, జిల్లా బీసీ సంక్షేమ అధికారి, రాయచోటి

సాంకేతిక విద్యలో తెలుగు రాష్ట్రాలు ముందంజ

న్యూఢిల్లీ ఏఐసీటీఈ చైర్మన్ టీజీ సీతారాం



టీజీ సీతారాంను సన్మానిస్తున్న మిట్స్ కళాశాల యాజమాన్యం

కురబలకోట: సాంకేతిక విద్యలో తెలుగు రాష్ట్రాలు ముందంజలో ఉన్నాయని, దేశంలోని వివిధ ఐఐటీలలో 30 నుంచి 40 శాతం మంది వీరే కన్పిస్తారని న్యూఢిల్లీ ఏఐసీటీఈ (ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్) చైర్మన్ టీజీ సీతారాం పేర్కొన్నారు. శనివారం సాయంత్రం మదనపల్లె సమీపంలోని అంగళ్లు మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో కొత్తగా కమ్యూనిటీ కోసం ఏర్పాటు చేసిన రేడియో స్టేషన్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం కళాశాల ఆడిటోరియంలో జరిగిన ప్రత్యేక సమావేశంలో మాట్లాడుతూ సాంకేతిక విద్యలో రాణించడం ద్వారా విద్య, ఉపాధి, ఉద్యోగావకాశాల్లో రాణించవచ్చన్నారు. జాతీయ విద్యా విధానం ప్రగతికి మార్గమన్నారు. వివిధ ఆన్‌లైన్ కోర్సులను, స్కాలర్‌షిప్పులను విద్యార్థులు వినియోగించుకోవాలన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, విమర్శనాత్మక ఆలోచనను పెంపొందించేందుకు మాతృబాషలో విద్యను అందించడం ఎన్ఈపీ–20 ధ్యేయమన్నారు. వివిధ పాఠ్యపుస్తకాల రచనను ప్రాంతీయ భాషల్లో చేపట్టిందన్నారు. వివిధ అక్రిడేషన్లు సాధించి అటానమస్ స్థాయిలో ఉన్న ఈ కళాశాల భవిష్యత్తులో యూనివర్సిటీ కాగలదన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. మిట్స్ కళాశాల కరస్పాండెంట్ ఎన్. విజయభాస్కర్ చౌదరి, నాదేళ్ల ద్వారకనాథ్, ప్రిన్సిపాల్ యువరాజ్ పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

ముఖ్యమంత్రి సలహాదారు ధనుంజయరెడ్డి



తల్లెంవారిపల్లె హైస్కూల్‌లో నూతన భవన నిర్మాణం కోసం స్థల పరిశీలన చేస్తున్న సీఎం సలహాదారు

ఓబులవారిపల్లె: కార్పొరేట్ పాఠశాలలకన్నా మెరుగైన విద్యను ప్రభుత్వ పాఠశాలల ద్వారా అందిస్తున్నామని ముఖ్యమంత్రి సలహాదారు ఆర్.ధనుంజయరెడ్డి పేర్కొన్నారు. శనివారం గాదెల పంచాయతీ తల్లెంవారిపల్లె నూతన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. పాఠశాలలో తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు నేడుతో పాఠశాలల రూపురేఖలను మార్చివేశారన్నారు. గ్రామీణ విద్యార్థుల కోసం ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెట్టారని తెలిపారు. దీంతో గ్రామీణ విద్యార్థులు ప్రపంచంతో పోటీ పడేందుకు అవకాశం లభించిందన్నారు. అనంతరం తల్లెంవారిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నూతన భవన నిర్మాణం విషయమై అన్నమయ్య జిల్లా విద్యాశాఖ అధికారి బి.పురుషోత్తంతో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్‌రెడ్డి, చిట్వేలి మండల కన్వీనర్ చెవ్వు శ్రీనివాసులురెడ్డి, సర్పంచ్ కృష్ణయ్య, మాజీ ఎంపీపీ రామకృష్ణయ్య, ఎంఈఓ పద్మజ, ఎంపీటీసీ నరసింహ, సీనియర్ నాయకులు కొమ్మూరు భాస్కర్‌రెడ్డి, కొమ్మూరు నారాయణరెడ్డి, కొమ్మూరు శేఖర్‌రెడ్డి, గురివిరెడ్డి, కొలవల అమర్‌నాథ్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడాపాఠశాల ఎంపికలకు స్పందన

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని డాక్టర్ వైఎస్సార్ క్రీడాపాఠశాలలో 4వ, 5వ తరగతిలో ప్రవేశాల కోసం నిర్వహించిన జిల్లాస్థాయి ఎంపికలకు క్రీడాకారుల నుంచి చక్కటి స్పందన లభించింది. తొలిరోజు శుక్రవారం 25 మంది హాజరుకాగా, రెండోరోజు శనివారం 54 మంది విద్యార్థులు హాజరుకావడం విశేషం. మొత్తం మీద 4వ తరగతికి 43 మంది, 5వ తరగతికి 36 మంది చొప్పున మొత్తం 79 మంది హాజరయ్యారు. ఈ ఎంపికలను స్టెప్ సీఈఓ సి. సాయిగ్రేస్, డీఎస్ఏ చీఫ్ కోచ్ ఎస్.వి.పి. అమృత్‌రాజ్‌లు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ జిల్లా ఎంపికల్లో ప్రతిభ కనబరిచిన వారిని ఈనెల 29, 30 తేదీల్లో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో నిర్వహించే రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తామన్నారు. విద్యార్థులకు ఎత్తు, బరువు, మెడిసినల్ బాల్ త్రో, 30 మీటర్ల ఫ్లయింగ్ స్టార్ట్, షటిల్ రన్, స్టాండింగ్ బ్రాడ్‌జంప్, 800 మీటర్ల పరుగుపందెంలో ఎంపికలు నిర్వహించారు.

పేద విద్యార్థులకు సేవ హర్షణీయం

ప్రభుత్వ ఎలక్ట్రానిక్ మీడియా సలహాదారు మహ్మద్ అలీ



కార్యక్రమంలో మాట్లాడుతున్న సినీనటుడు అలీ

పెనగలూరు: ఏపీఆన్‌లైన్ సీఈఓ, హెడ్‌ఆఫ్ స్ట్రాటజిక్ ఇన్షియేటివ్స్ డాక్టర్ యనమల భాస్కర్ సేవలు హర్షణీయమని ప్రభుత్వ ఎలక్ట్రానిక్ మీడియా సలహాదారు, సినీ నటుడు మహ్మద్ అలీ పేర్కొన్నారు. శనివారం పెనగలూరు మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ యనమల భాస్కర్ ఆధ్వర్యంలో దాదాపు రూ. 36 లక్షల వ్యయంతో బాలుర వసతి గృహంలో ఏర్పాటు చేసిన ఇనుప మంచాలు, ఆర్ఓ ప్లాంట్, ర్యాక్‌లు, బెడ్‌లు, ఉన్నత పాఠశాలలో 250 బెంచ్‌లు, ఆర్ఓ వాటర్ ప్లాంట్‌ను మహమ్మద్ అలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు సహకారం అందించడం ఆనందంగా ఉందన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, అలాగే ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిలు విశాల హృదయంతో ఆలోచన చేసి ప్రజల గుండెల్లో నిలిచిపోయే పథకాలను ప్రవేశపెట్టారని అన్నారు. అనంతరం యనమల భాస్కర్ మాట్లాడుతూ తాను ఉన్నత పాఠశాలలో చదివానని పాఠశాలకు తన వంతు సహాయ సహకారాలు అందించాలనే లక్ష్యంతో సేవా కార్యక్రమాలను చేపట్టానని తెలిపారు. అంతకు ముందు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మధుసూదన్‌రెడ్డి, ఉపాధ్యాయులు మహ్మద్‌అలీ, యనమల భాస్కర్‌కు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు ముక్కా రూపానందరెడ్డి, మాజీ ఎంపీపీ తమ్మెద తిరుపాల్, సర్పంచ్ దేపూరు చిన్న వెంగల్ రెడ్డి, వేంపల్లి సర్పంచ్ ఆర్ఎల్‌వీ ప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఆదినారాయణరెడ్డి, సిరాజ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కదలిన యంత్రాంగం



జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రజల సమస్యలను తెలుసుకుని నమోదు చేస్తున్న వలంటీర్లు, అధికారులు

- జగనన్న సురక్షతో ఇటింటికి వెళుతున్న వలంటీర్లు
- జిల్లా వ్యాప్తంగా ఎక్కడికక్కడ పర్యవేక్షణకు స్పెషల్ ఆఫీసర్లు
- కలెక్టరేట్‌లో కంట్రోల్ రూము
- తొలిరోజు 16,118 ఇళ్లకు 1017 మంది వలంటీర్లు

సాక్షి రాయచోటి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం సత్ఫలితాలిచ్చే దిశగా సాగుతోంది. శనివారం వలంటీర్లు మొదలుకొని జిల్లా యంత్రాంగం వరకు అందరూ ఇంటింటికి వెళ్లే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. జిల్లా వ్యాప్తంగా ఈ కార్యక్రమం మంచి ఫలితాలు అందించే విధంగా జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ ప్రత్యేకంగా మండలస్థాయితోపాటు నియోజకవర్గాలకు ప్రత్యేకంగా స్పెషల్ ఆఫీసర్లను నియమించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 23న ఈ కార్యక్రమాన్ని అమరావతి నుంచి ప్రారంభించారు. జగనన్న సురక్ష కార్యక్రమం తొలిరోజైన శనివారం వలంటీర్లతోపాటు అధికారులు పట్టణాలు, పల్లెబాట పట్టి ప్రజలతో మమేకమయ్యారు.

తొలిరోజు 16,118 ఇళ్లకు బృందాలు

జిల్లా వ్యాప్తంగా జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా తొలిరోజు వలంటీర్లు అధికారులతో కూడిన బృందాలు సమగ్ర సర్వేలో నిమగ్నమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 5,38,771 గృహాలు ఉండగా 16,118 ఇళ్లకు వెళ్లి వివరాలు సేకరించారు. సంక్షేమ పథకాలు అందని వారి వివరాలతోపాటు ఇతర అనేక అంశాలపై ప్రజలతో మాట్లాడారు.


రాష్ట్రంలో అన్నమయ్యకు రెండవస్థానం

జగనన్న సురక్ష కార్యక్రమం గ్రేడింగ్‌ల్లోనూ అన్నమయ్య జిల్లా దూసుకుపోతోంది. తొలిరోజు 1017 మంది వలంటీర్లు ఇళ్లబాట పట్టి సర్వే నిర్వహించారు. వివిధరకాల సమస్యలకు సంబంధించి 479 దరఖాస్తులు రాగా, అందులో 178 దరఖాస్తులు వివిధ సర్టిఫికెట్లకు సంబంధించినవి ఉన్నాయి. తొలిరోజు రాష్ట్రంలోనే గ్రేడింగ్‌ల ప్రకారం మొదటి స్థానంలో పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా ఉండగా, రెండవ స్థానంలో అన్నమయ్య జిల్లా ఉండడం విశేషం.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూము

జగనన్న సురక్ష కార్యక్రమ ఫిర్యాదుల స్వీకరణకు జిల్లా కేంద్రమైన రాయచోటిలోని కలెక్టరేట్‌లో కంట్రోల్ రూము ఏర్పాటు చేశారు. నలుగురు సిబ్బందిని నియమించి ప్రత్యేకంగా దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. ప్రజలు నేరుగా ఫిర్యాదులను 08561–293006 నంబరుకు ఫోన్ చేసి తెలియజేసేలా చర్యలు చేపట్టారు. తొలిరోజు వివిధ సమస్యలకు సంబంధించి 13 దరఖాస్తులు వచ్చాయి.

సద్వినియోగం చేసుకోవాలి



జిల్లాలో ప్రజలు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి. అర్హులుగా ఉండి సంక్షేమం అందని వారైనా....ఇతర సమస్యలున్నా వలంటీర్లు, అధికారులు మీ ఇంటి వద్దకే వస్తున్నారు. సుమారు 11 రకాల సర్టిఫికెట్లకు సంబంధించిన సర్వీసులన్నీ ఉచితంగా అందజేస్తున్నాం. నెలరోజులపాటు జరిగే ఈ కార్యక్రమంలో పాలుపంచుకుని ప్రజలు ప్రయోజనాన్ని పొందాలి. – గిరీషా పీఎస్, కలెక్టర్, అన్నమయ్య

దిగుబడి తగ్గింది.. ధర పెరిగింది

- రోజురోజుకు పెరుగుతున్న టమాట రేట్లు
- మార్కెట్‌లో కిలో రూ.48


రవాణాకు సిద్ధంగా ఉంచిన టమాటలు

గుర్రంకొండ : టమాట ధరలు మార్కెట్లో పుంజుకొన్నాయి. వారం రోజుల క్రితం ధరలతో పోల్చితే 60 శాతం మేర పెరిగాయి. మార్కెట్లో కిలో రూ.48 వరకు పలుకుతున్నాయి. బయట రాష్ట్రాలతోపాటు మన రాష్ట్రంలోనూ ప్రస్తుత ఎండలకు టమాట దిగుబడులు పూర్తిగా తగ్గిపోయాయి. బయట రాష్ట్రాల వ్యాపారుల రాకతో ధరలు బాగా పెరిగాయి. దీంతో ఈ ప్రాంతంలో పండించిన పంటకు గిట్టుబాటు ధరలు లభిస్తున్నట్లు వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రస్తుతం జిల్లాలో 25,250 ఎకరాల్లో టమాట దిగుబడి వస్తోంది. నెల రోజుల వరకు ఇవే ధరలు నిలకడగా ఉంటాయని వ్యాపార వర్గాలు అంటున్నాయి.

25,250 ఎకరాల్లో దిగుబడి

జిల్లాలోని అన్ని మార్కెట్ కమిటీ యార్డు పరిధిల్లో ప్రతి ఏడాది ఈ సీజన్‌లో 22 వేల నుంచి 25,250 ఎకరాల్లో టమాట పంట దిగుబడి వస్తుంది. బయట రాష్ట్రాల్లో ఎండల తాకిడికి పూర్తిగా టమాట పంట దిగుబడి తగ్గిపోయింది. అయితే రాయలసీమ జిల్లాల్లో ఎక్కువగా టమాట పంట సాగు చేస్తుంటారు. వేసవి కాలంలో అన్ని ప్రాంతాల కంటే మన జిల్లాలోని పడమటి ప్రాంతాలు (పీలేరు, మదనపల్లె, తంబళ్లపల్లె)లలో వాతావరణమే టమాట సాగుకు కొంత మేరకు అనుకూలంగా ఉంటుంది. దీంతో రైతులు టమాట పంట అధికంగా సాగు చేస్తుంటారు.

ఆశాజనకంగా ధరలు

వారం రోజులుగా టమాట ధరలు భారీగా పెరుగుతున్నాయి. వారం రోజులు కిందట 30 కేజీల టమాట క్రీట్ ధరలు అత్యధికంగా రూ.450 లోపే ఉన్నాయి. అయితే ప్రస్తుతం ఒక క్రీట్ ధర రూ.1000 నుంచి రూ.1200 వరకు పలుకుతున్నాయి. వారం రోజులుగా మార్కెట్లో టమాట ధరలు ఒక్కసారిగా పెరుగుతుండడం గమనార్హం.

బయట రాష్ట్రాల్లో దెబ్బతిన్న తోటలు

రాయల సీమతోపాటు బయట రాష్ట్రాల్లో ప్రస్తుత వేసవి ఎండలకు టమాట తోటలు భారీగా దెబ్బతిన్నాయి. దీంతో అక్కడ టమాట దిగుబడులు పూర్తిగా తగ్గిపోయాయి. ప్రస్తుతం బయట రాష్ట్రాలతోపాటు మన రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు మన జిల్లా నుంచి టమాటలు ఎగుమతి అవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ ప్రాంతంలో పండించే టమాటలకు ధరలు వస్తున్నాయి. వేసవి కాలంలో ఎంతో కొంత టమాట పంట దిగుబడి వచ్చేది పడమటి ప్రాంతాలే కావడం గమనార్హం. దీంతో మార్కెట్లో ధరలు ఒక్కసారిగా పెరిగాయి.

ఇత రాష్ట్రాల వ్యాపారుల రాక

జిల్లాలోని మార్కెట్ యార్డులకు ప్రస్తుతం వారంరోజులుగా తమిళనాడు, ఒరిస్సా, పశ్చిమబెంగాల్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు వస్తున్నారు. ప్రతిరోజు ఇక్కడి టమాటలను కొనుగోలు చేసి తరలిస్తున్నారు. బయట రాష్ట్రాల్లో టమాటల దిగుబడి తగ్గిపోవడంతో బయట ప్రాంతాలకు చెందిన వ్యాపారులు ఇక్కడే మకాం వేసి కొనుగోలు చేయడం విశేషం. ప్రతి రోజు జిల్లా నుంచి 150 వాహనాల్లో టమాటలను మన రాష్ట్రంతోపాటు బయట రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు.

టమాట స్టాకు, ధరల వివరాలు ఇలా ఉన్నాయి

తేదీ (జూన్)	స్టాకు (టన్నుల్లో)	ధరలు (రూ.లలో) (25 కేజీల బాక్స్)
18	1925	850
19	2012	1050
20	2032	950
21	2251	900
22	2354	1050
23	2195	1100
24	2350	1200

టమాట ధరలు పుంజుకొన్నాయి



గత వారం రోజులతో పోల్చితే మార్కెట్లో టమాట ధరలు ప్రస్తుతం భారీగా పుంజుకొంటున్నాయి. ఇవే ధరలు 30 రోజుల వరకు నిలకడగా ఉండే సూచనలు కనిపిస్తున్నాయి. బయట రాష్ట్రాలతోపాటు మన రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో ఎండల వేడిమికి టమాట పంట దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. దీంతో మన జిల్లాలో ముఖ్యంగా పడమటి ప్రాంతాల్లో టమాట దిగుబడి ఎంతో కొంత వస్తోంది. దీంతో మార్కెట్లో టమాట ధరలు ఒక్క సారిగా పుంజుకొన్నాయి. – జగదీష్, కార్యదర్శి, వాల్మీకిపురం మార్కెట్ కమిటీ

ఇరు వర్గాలపై కేసు నమోదు

రాయచోటి టౌన్ : ఆస్తి తగాదాలతో ఇరు వర్గాల మధ్య చోటు చేసుకున్న గొడవలో 10 మందిపై కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. శనివారం రాయచోటి పట్టణంలోని మదనపల్లె రోడ్డులో ఓ స్థల వివాదమై ఇరు వర్గాల వారు పరస్పరం దాడి చేసుకున్నారు. విషయం తెలుసుకున్న అర్బన్ సీఐ తన సిబ్బందితో సంఘటన స్థలం వద్దకు వెళ్లి ఇరు వర్గాల వారిని చెదరగొట్టి వారిని అదుపులోకి తీసుకున్నారు. ఇరువర్గాలకు చెందిన 10 మందిపై కేసు చేసినట్లు సీఐ తెలిపారు.

సారా ఊట ధ్వంసం


సారా ఊట ధ్వంసం చేస్తున్న సెబ్ అధికారులు

కేవీపల్లె : సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 800 లీటర్ల ఊట ధ్వంసం చేసినట్లు పీలేరు సెబ్ సీఐ గురుప్రసాద్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని జిల్లేళ్లమంద గ్రామ పరిసర అటవీ ప్రాంతంలో సారా తయారీ చేస్తున్నట్లు అందిన సమాచారంతో సెబ్ అధికారులు దాడులు నిర్వహించారు. సారా బట్టీలు గుర్తించి 800 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేసినట్లు సీఐ తెలిపారు. ఈ దాడిలో సెబ్ ఎస్ఐ లక్ష్మీనరసయ్య, సిబ్బంది సుధాకర్, లోకేష్ పాల్గొన్నారు.

ఒంటిమిట్ట మండలంలో చోరీలు

ఒంటిమిట్ట : మండల పరిధిలోని సాలాబాద్, మలకాటిపల్లి గ్రామాల్లో చోరీలు జరిగినట్లు సమాచారం. స్థానికుల వివరాల మేరకు... శుక్రవారం అర్ధరాత్రి సాలాబాద్ గ్రామంలో కల్లిశెట్టి పెంచలయ్యతోపాటు కుటుంబ సభ్యులు ఆరుబయట నిద్రిస్తుండగా.. ఇంటి వెనుక వైపు ఉన్న కిటికీని దుండగులు పగులకొట్టి లోపలికి చొరబడ్డారు. బీరువాను పగులగొట్టి 10 తులాల బంగారు, రెండు లక్షల నగదు, దేవుని గదిలోని రెండు హుండీలను చోరీ చేశారు. తెల్లారే సరికి ఇంటిలోనికి వెళ్లి చూసుకుంటే బీరువా తెరిచి ఉన్నట్లు గమనించిన వారు వెంటనే స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. అలాగే మలకాటిపల్లి గ్రామంలో దాస్ అనే వ్యక్తి ఇంట్లో చోరీ జరిగింది. ఇంటి యజమాని మిద్దెపైన పడుకుని ఉండగా దొంగలు ప్రధాన మార్గం నుంచే వాకిళ్లు పగుల గొట్టి చొరబడి 9 ఉంగరాలు, రూ. 5 వేల నగదును చోరీ చేసినట్లు తెలిసింది. ఈ చోరీలపై వివరణ కోరేందుకు పోలీసులను ఫోన్ ద్వారా సంప్రదించగా స్పందించలేదు.

ప్రేమ పేరుతో వంచన.. గర్భం దాల్చిన బాలిక


నిందితుడి అరెస్ట్ చూపుతున్న డీఎస్పీ కేశప్ప

బి.కొత్తకోట : పదో తరగతి ఫెయిలై ఇంటి పట్టున ఉంటున్న అభం శుభం తెలియని బాలికను.. పెళ్లయి ఇద్దరు సంతానం ఉన్న ఓ వ్యక్తి ప్రేమ పేరుతో వంచించగా గర్భం దాల్చింది. ఈ విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు దిశ యాప్ ద్వారా ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని కటకటాల వెనక్కు పంపారు. ఈ సంఘటన బి.కొత్తకోట మండలం గుమ్మసముద్రం పంచాయతీలో జరిగింది. శనివారం మదనపల్లె డీఎస్పీ కేశప్ప దీనికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. గుమ్మసముద్రం పంచాయతీ బుచ్చిరెడ్డిగారిపల్లెకి చెందిన మైనర్‌బాలిక (15) పదో తరగతి ఫెయిలై ఇంటి వద్ద ఉంటోంది. బాలిక ఒంటరిగా ఉంటున్న సమయంలో చూసుకుని అదే గ్రామానికి చెందిన బి.ఆదినారాయణ (26) నిన్ను ప్రేమిస్తున్నాను, పెళ్లి చేసుకుని బాగా చూసుకుంటానని నమ్మించేవాడు. తర్వాత బాలికకు మాయమాటలు చెప్పి బలవంతంగా వశ పరుచుకున్నాడు. పలుమార్లు శారీరకంగా కలవడంతో బాలిక గర్భం దాల్చింది. ఈ విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు మోసం చేసిన ఆదినారాయణను నిలదీశారు. తర్వాత దిశ యాప్ ద్వారా ఫిర్యాదు చేశారు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు ఆదినారాయణపై స్థానిక పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేసిన పోలీసులు వాస్తవాలు నిర్ధారించుకుని.. నిందితుడిని శనివారం స్థానిక దిగువబస్టాండ్ వద్ద అరెస్ట్ చేశారు. కాగా ఇటీవల కాలంలో మైనర్ బాలికలను ప్రేమ పేరుతో మోసం చేసి గర్భవతులు చేస్తున్న ఘటనలు మదనపల్లె సబ్‌డివిజన్‌లో జరుగుతున్నాయని డీఎస్పీ కేశప్ప చెప్పారు. ఈ విషయంలో తల్లిదండ్రులు పలు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఇలాంటి ఘటనలపై నిర్లక్ష్యం చేయకుండా స్థానిక పోలీసుల దృష్టికి తీసుకు రావాలని, పోలీసులు న్యాయం చేస్తారని చెప్పారు.

ఎస్‌ఈబీ ప్రతిష్టను దెబ్బతీసేందుకు ప్రయత్నాలు

- ములకలచెరువు ఘటనపై ఉన్నతాధికారుల విచారణ
- అవాస్తవాలను ప్రచారం చేయవద్దన్న ఏఈఎస్


మాట్లాడుతున్న ఎస్‌ఈబీ ఏఈఎస్ రాధాకృష్ణ, చిత్రంలో సీఐ మల్లిక

మదనపల్లె : మదనపల్లె ఎస్‌ఈబీ పరిధిలో నాటు సారా, కర్ణాటక మద్యం అక్రమరవాణా, విక్రయాలను అరికట్టేందుకు సిబ్బంది అహర్నిశలు శ్రమిస్తున్నప్పటికీ కొందరు పనిగట్టుకుని బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారని ఏఈఎస్ రాధాకృష్ణ అన్నారు. శనివారం స్థానిక ఏఈఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అడిషనల్ ఎస్పీ రాజ్‌కమల్ ఆదేశాల మేరకు ఈ ఏడాది జనవరి నుంచి జూన్ 20వ తేదీ వరకు మదనపల్లె ఎస్‌ఈబీ సర్కిల్ పరిధిలోని మదనపల్లె, వాల్మీకిపురం, ములకలచెరువు, పీలేరు సర్కిళ్లలో సారాకు సంబంధించి 143 కేసులు, బెల్లంఊట 301 కేసులు నమోదయ్యాయని, 258 మంది నిందితులను అరెస్ట్ చేశామన్నారు. 3,991 లీటర్ల సారా, 685 కిలోల నల్ల బెల్లం స్వాధీనం చేసుకోవడంతో పాటుగా 1,33,830 లీటర్ల సారా ఊట ధ్వంసం చేశామన్నారు. 48 వాహనాలను సీజ్ చేశామన్నారు. ఎన్‌డీపీఎల్ కర్ణాటక మద్యంకు సంబంధించి 124 కేసుల్లో 152 మంది నిందితుల అరెస్ట్‌తోపాటుగా 2,408 లీటర్ల మద్యం, 41 వాహనాలు సీజ్ చేశామన్నారు. సారా, కర్ణాటక మద్యం అక్రమరవాణాలో దొరికిన వ్యక్తులను అడిషనల్ ఎస్పీ ఆదేశాల మేరకు రూ.లక్ష ష్యూరిటీతో బైండోవర్ చేస్తూ, తిరిగి నేరంలో రెండోసారి పట్టుబడితే స్థానిక తహసీల్దార్ సమక్షంలో హాజరుపరిచి జరిమానా వసూలు చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటి వరకు 372 మందిని బైండోవర్ చేస్తే.. 57 మంది రెండుసార్లు నేరం చేస్తూ పట్టుబడితే.. వారి నుంచి రూ.12,56,000 డిపాజిట్లు వసూలు చేశామన్నారు. రెండు రోజులుగా ఎస్‌ఈబీ శాఖపై కొందరు వ్యక్తులు పనికట్టుకుని పలు వదంతులు ప్రచారం చేయడం బాధాకరమన్నారు. శాఖ ప్రతిష్టను దిగజార్చేలా సోషియల్ మీడియా, కొన్ని మాధ్యమాల్లో అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారన్నారు. ములకలచెరువు ఘటనలో సీఐ మల్లికపై చేసిన ఆరోపణలు నిరాధారమన్నారు. కేసుపై ఉన్నతాధికారుల విచారణ జరుగుతోందని, బాధ్యులు ఎంతటివారైనా విడిచిపెట్టేది లేదన్నారు. దోషులు తేలేంత వరకు అసత్య ప్రచారాలు చేయవద్దని, ఎస్‌ఈబీ శాఖకు సహకరించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ములకలచెరువు సీఐ మల్లిక పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ ఎదుట మహిళ ఆత్మహత్యాయత్నం

- ఫిర్యాదు చేసేందుకు వెళ్తే ప్రత్యర్థులు దాడి చేశారని మనస్తాపం



స్టేషన్ బయట ఆత్మహత్యకు ప్రయత్నించిన షాహిదా

మదనపల్లె : కూతురిని కొట్టారంటూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన మహిళపై స్టేషన్ ఆవరణలోనే ప్రత్యర్థులు దాడి చేస్తే మనస్తాపంతో చేతి గాజులు పగలగొట్టుకుని నోట్లో వేసుకుని మింగి ఆత్మహత్యకు ప్రయత్నించిన ఘటన శనివారం సాయంత్రం జరిగింది. పట్టణంలోని రామారావుకాలనీకి చెందిన దాదాపీర్‌కు ఇద్దరు భార్యలు. మొదటిభార్య షాకీరా మృతి చెందడంతో ఇదే ప్రాంతానికి చెందిన షాహిదాను 15 ఏళ్ల క్రితం వివాహం చేసుకున్నారు. కాగా మొదటి భార్య బిడ్డలకు షాహిదా కుటుంబానికి మధ్య కొన్నేళ్లుగా వివాదం నడుస్తోంది. ఈక్రమంలో శనివారం మధ్యాహ్నం మొదటి భార్య కుమారుడు నజీర్ వరుసకు పినతల్లి అయిన షాహిదా, ఆమె కుమార్తె సానియాపై దాడి చేసి గాయపరిచాడు. దీంతో బాధితురాలు, ఆమె కుమార్తె ఇద్దరు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి తమను కొడుకు వరుసైన నజీర్ కొట్టినట్లు తెలిపింది. దీంతో ఓ కానిస్టేబుల్ వెళ్లి నజీర్‌ను విచారణ నిమిత్తం స్టేషన్‌కు తీసుకువచ్చారు. షాహిదా తాను చదువుకోలేదని, కంప్లైంట్ రాయాల్సిందిగా పోలీసులను కోరింది. దీనికి వారు ఇవాళ కాదు. రేపు రావాల్సిందిగా చెప్పారు. ఇదిలా ఉండగా నజీర్, అతడి బంధువులు కొంతమంది స్టేషన్‌కు వచ్చి తమపైనే ఫిర్యాదు చేస్తావా అంటూ షాహిదాను పోలీస్‌స్టేషన్ ఆవరణలో చితకబాదారు. టూ టౌన్ ఎస్ఐ సుబ్బారెడ్డి, పోలీసుల కళ్లెదుటే షాహిదాపై దాడి జరుగుతున్నా వారు వారించే ప్రయత్నం చేయకపోగా చూస్తూ ఉండిపోయారు. ఇరువర్గాలను బయటకు పంపేశారు. ఈ సందర్భంగా బాధితురాలు షాహిదా స్టేషన్‌లోనే తనపై దాడికి పాల్పడ్డవారు రాత్రి సమయంలో తనను చంపేస్తే బిడ్డకు దిక్కు ఎవరిని ఆవేదన వ్యక్తం చేసింది. ప్రాణ భయంతో స్టేషన్ ఎదుట తన చేతికి ఉన్న గాజులను పగులగొట్టుకుని నోట్లో వేసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించింది. దీంతో బాధితురాలి కుమార్తె సానియా కేకలు వేయడంతో గమనించిన స్థానికులు ఆటోలో షాహిదాను జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై టూటౌన్ సీఐ మురళీకృష్ణ మాట్లాడుతూ.. ప్రభుత్వాసుపత్రిలో బాధితురాలిని విచారణ చేసి, అక్కడే ఫిర్యాదు తీసుకుంటామన్నారు. బాధితురాలికి న్యాయం చేస్తామన్నారు.

స్త్రీలు అన్ని రంగాల్లో రాణించాలి


మాట్లాడుతున్న ఆర్‌జేడీ డాక్టర్ బాబు

మదనపల్లె సిటీ : స్త్రీలు ఆత్మవిశ్వాసంతో అన్ని రంగాల్లో రాణించాలని ఉన్నత విద్యాశాఖ ఆర్‌జేడీ డాక్టర్ కె.బాబు అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణవేణి అధ్యక్షతన ఐసీఎస్ఎస్ఆర్ జాతీయ సదస్సులో భాగంగా రెండో రోజు 75 ఏళ్ల స్వతంత్ర భారతంలో మహిళాభివృద్ధి, సవాళ్లు అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్త్రీలు విద్యను అభ్యసించి ఆర్థికంగా తమ కాళ్లమీద నిలబడాలన్నారు. పద్మావతి మహిళా డిగ్రీ కాలేజీ ఆచార్యులు కృష్ణవేణి విద్యార్థులను ఉద్దేశించి స్ఫూర్తిదాయకంగా మాట్లాడారు. ప్రిన్సిపల్ కృష్ణవేణి మాట్లాడుతూ అందరి సహకారంతో జాతీయ సదస్సు విజయవంతమైనట్లు పేర్కొన్నారు. తెలుగు విభాగం అధ్యాపకులు జ్యోతి, శ్రీదేవిలను ప్రశంసించారు. జాతీయ సదస్సులో స్త్రీల అభివృద్ధి సవాళ్లు గురించి పరిశోధన పత్రాలను వివిధ అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు సమర్పించారు. అనంతరం ఆర్‌జేడీని అధ్యాపకులు సన్మానించారు. కార్యక్రమంలో యోగి వేమన యూనివర్సిటీ ఆచార్యులు డాక్టర్ ఈశ్వరరెడ్డి, కో–కన్వీనర్ వనజ, అధ్యాపకులు మోహన్‌వల్లి, శివపార్వతి, విష్ణుప్రియ, నమత్ర, మోహన్‌బాబు, సుబ్బరాయుడు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాసరెడ్డి హత్య కేసులో సమగ్ర దర్యాప్తు

కడప అర్బన్ : వైఎస్ఆర్‌సీపీ నాయకుడు చిన్ననాగిరెడ్డిగారి శ్రీనివాసులరెడ్డి హత్య కేసులో పోలీసులు సమగ్ర దర్యాప్తు చేస్తున్నారు. ఆయనను శుక్రవారం ఉదయం కడప నగరంలోని సంధ్యా సర్కిల్ సమీపంలో బురఖాలను ధరించి వచ్చిన ఇద్దరు దారుణంగా వేటకొడవళ్లతో నరికి చంపారు. వారికి దగ్గరనే మరో ఇద్దరు కాపలాగా వుండి, ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరుగకుండా చూసుకున్నారని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించుకున్నారు. ఈ హత్య వెనుక ఎవరెవరి హస్తం వుంది? ఎవరు అతన్ని అంత దారుణంగా హత్య చేయాల్సి వచ్చింది? అనే కోణంలో కూడా పోలీసు అధికారులు, తమ సిబ్బందితో కలిసి విచారణ చేస్తున్నారు. మరో వైపు ఈ హత్య జరగడానికి ముందు కొన్ని రోజుల నుంచి ప్రధాన నిందితుడు, సంఘటనలో ప్రత్యక్షంగా పాల్గొన్న మోపురు ప్రతాప్‌రెడ్డికి, శ్రీనివాసుల రెడ్డికి మధ్య విభేదాలు తలెత్తాయని విచారణలో భాగంగా తెలుస్తోంది. అంతకు ముందు ఎంతో స్నేహంగా వున్న వీరు ఆర్థిక లావాదేవీలు, స్థల వివాదాల కారణంగానే దూరంగా వుండి, ఒకరినొకరు ఫోన్‌లలో దుర్భాషలాడుకుంటూ సంభాషించుకున్నారని సమాచారం. ఈ హత్యకు ఇంకా ప్రతాప్ రెడ్డితోపాటు మరికొందరి పాత్ర కీలకంగా వుందని భావిస్తున్నారు. మృతుడి భార్య మౌనిక అనుమానితులుగా తమ ఫిర్యాదులో ఇచ్చిన మేరకు ప్రధానంగా మోపురు ప్రతాప్‌రెడ్డి పేరు పేర్కొన్నారు. అతనితోపాటు టీడీపీ నాయకులైన జమీల్ మొబైల్స్ అధినేత జమీల్, పాలెం సుబ్బారెడ్డి, గుంటి నాగేంద్రతోపాటు, విశ్వనాథరెడ్డి పేర్లను అనుమానితులుగా పేర్కొన్నారు. వీరి పాత్ర ఏమేరకు ఈ హత్య కేసులో వుందో పోలీసులు నిగ్గు తేలుస్తున్నారు. ఇప్పటికే ప్రధాన సూత్రదారి ప్రతాప్‌రెడ్డి, మరొకరు బురఖాలను ధరించి ప్రత్యక్షంగా.. శ్రీనివాసులరెడ్డిని దారుణంగా వేటకొడవళ్లతో, పిడిబాకు తో చంపారని సీసీ టీవీ ఫుటేజీల ద్వారా నిర్ధారించారు. వారికి అండగా మరో ఇద్దరు సంఘటన స్థలం వద్ద వున్నారని తెలుసుకున్నారు. ఇంకా పై ఇద్దరు నిందితులతోపాటు మరో ఆరుగురి పాత్ర వుందని పోలీసులు తమ విచారణలో తేల్చినట్లు సమాచారం. ప్రస్తుతం ప్రతాప్‌రెడ్డి, మరో ఐదుగురు పోలీసుల అదుపులో వున్నారనీ తెలిసింది. ఇంకా పలువురి పాత్రపై విచారణ చేపట్టడంతోపాటు, మరికొందరిని అదుపులోకి తీసుకోనున్నారు. వీరిని రహస్య ప్రాంతంలో కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్, కడప ఒన్‌టౌన్ సీఐ ఎస్.వి నాగరాజు, కడప రూరల్ సీఐ కె.అశోక్‌రెడ్డి, ఎస్ఐలు, సిబ్బందితో కలిసి ప్రత్యేక బృందాలుగా ఏర్పడి సమగ్రంగా విచారణ చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. నేడో, రేపో ఈ హత్యకు సంబంధించిన నిందితులను అరెస్ట్ చేసి మీడియా ముందు ప్రవేశపెట్టనున్నారు.

అమ్మ, నాన్నల ఆశయాన్ని నెరవేర్చా


మాట్లాడుతున్న సివిల్‌టాప్ ర్యాంకర్ పవన్‌దత్త

కడప ఎడ్యుకేషన్ : తనకు డాక్టర్ కావాలని ఇష్టమున్నా, కలెక్టర్ కావాలన్న తల్లిదండ్రుల ఆశయాన్ని నెరవేర్చానని, ఇందుకు ఎంతో సంతోషంగా, తృప్తిగా ఉందని ఇటీవల సివిల్స్‌లో జాతీయ స్థాయిలో 22వ ర్యాంకు సాధించిన పవన్‌దత్తా అన్నారు. అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరుకు చెందిన డాక్టర్ పవన్ దత్తాకు శనివారం కడపలోని ఐఎంఏ హాలులో బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆయనతోపాటు తల్లిదండ్రులను ఘనంగా సన్మానించారు. పవనదత్తాను వేదపండితులు ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పవన్‌దత్తా మాట్లాడుతూ తనకు డాక్టర్ కావాలనే ఇష్టంతో ఎంబీబీఎస్‌ను పూర్తి చేశానని, అలాగే తల్లిదండ్రుల ఆశయం మేరకు సివిల్స్‌లో ర్యాంకు సాధించి వారి కోరిక మేరకు పేద ప్రజలకు, సమాజానికి, దేశానికి సేవలందిస్తానన్నారు. విజయవాడ సీఐడీ ఎస్పీ ఎంవీఎస్ స్వామి మాట్లాడుతూ ఉన్నతస్థాయి ఉద్యోగాల ద్వారానే పేద ప్రజలకు సేవ చేసే అవకాశం ఉంటుందన్నారు. నేటి పోటీ ప్రపంచంలో విద్యతో రాణించాలంటే పట్టుదల, కృషి ఎంతో అవసరం అన్నారు. తల్లిదండ్రుల కష్టాలను గుర్తెరిగి యువత కష్టపడి అనుకున్న ఆశయాలను నెరవేర్చుకోవాలన్నారు. అనంతరం సివిల్ టాప్ ర్యాంకర్ పవన్‌దత్త తోపాటు ఆయన తల్లిదండ్రులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో వెయ్యినూతలకోన ఆలయ ధర్మకర్త పిన్నిపాటి నరసింహహరిప్రసాద్, వేదిక్ యూనివర్సిటీ ప్రొఫెసర్ వరదరాజన్‌తోపాటు పలువురు ప్రముఖులు డాక్టర్ గోపీనాథ్, వెంకటపతిరాయల్, ఉదయభాస్కర్‌రాజు, శ్రీధర్‌రావు, నాగరాజురావు, చంద్రమౌళిశర్మ, విజయభట్టర్, తిరుమల పీఆర్‌ఓ నగేష్ తదితరులు పాల్గొన్నారు.